

పారిశుధ్య పనులు పర్యవేక్షణ

ప్రజాశక్తి -నెల్లూరు : నగరవ్యాప్తంగా జరుగుతున్న భూగర్భ డ్రయినేజీ ఇంటింటి కనెక్షన్ల, వాటర్ సప్లయ్ పనులను వేగవంతం చేసి, కాలుష్యరహిత నగరానికై తోడ్పడాలని కమిషనర్ వై.ఓ నందన్ అధికారులకు సూచించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 8 వ డివిజన్ నవాబు పేట, కుసుమ హరిజనవాడ,యనమలపాలెం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, వాటర్ సప్లయ్ ఇంటింటి కనెక్షన్ల పనులను కమిషనర్ సోమ వారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్. పి. నారాయణ ఆలోచనల మేరకు ప్రజలపై భారం పడకుండా భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లను కేవలం ఒక్క రూపాయికే అందిస్తున్నామని తెలిపారు. భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్లను నిర్దేశించిన ప్రతిరోజూ లక్ష్యాలను ఎల్ అండ్ టి, మెగా సంస్థ ప్రతినిధులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ శానిటేషన్, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

'కాకాణి'కి 14 రోజులు రిమాండ్

- ◆వెంకటగిరి కోర్టులో హాజరు
- ◆144 సెక్షన్ విధింపు
- ◆నెల్లూరు నుంచి భారీగా వైసిపి నేతలు, కార్యకర్తలు
- ◆భారీ భద్రత నడుమ జైలుకు తరలింపు
- ◆ప్రత్యేక సదుపాయాలకు అనుమతి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి 14 రోజులు రిమాండ్ విధించారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి ఎస్. విష్ణువర్మ తీర్పు నిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి వెంకటాపురం ఫామ్ హౌస్‌లో ఉండగా అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి నెల్లూరు పోలీసు ట్రైనింగ్ కాలేజీ వద్ద ఉంచారు. సోమవారం ఉదయం నెల్లూరు నుంచి పోలీసు బందోబస్తు నడుమ తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ కోర్టుకు తరలించారు. పొదలకూరు మండలం, తాటిపర్తి సమీపంలో రుస్తుం మైన్ లో అక్రమంగా క్వార్జ్ తరలించడం, పేలుడు పదార్థాలు నిల్వ ఉంచడం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసులో ఎ4 ముద్దాయిగా కాకాణి గోవర్ధన్ రెడ్డి పై పొదలకూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన విషయం తెలిసింది. మొత్తం పది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి తరపున రోజారెడ్డి, ఉమామహేశ్వరరావు వాదించారు. పిపిగా కేధర్‌నాథ్ వాదనలు వినిపించారు. సుమారు రెండు గంటల పాటు కోర్టులో వాదోపవాదనలు జరిగాయి. ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని కాకాణి తరపున లాయర్లు వాదించారు. పిపి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రిమాండ్ విధించి, రాజమండ్రి సెంటర్ జైలుకు తరలించాలని కోరినట్లు తెలిసింది. వాదనలు విన్నతరువాత న్యాయమూరి ఎస్. విష్ణువర్మ ఆయనకు 14 రోజులు జూన్ 9 వరకు రిమాండ్ విధించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి లాయర్ల వాదనలు మేరకు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.

పోలీసు బందోబస్తునడుమ జైల్లోకి వెళ్తున్న కాకాణి

నెల్లూరు సెంటర్ జైల్లో ప్రత్యేక గదిని, మంచం, వారానికి మూడు సార్లు లాయర్లు కలవడానికి అవకాశం కల్పించినట్లు తెలిసింది. అక్కడ నుంచి ఆయనను పోలీసులు సోమవారం సాయంత్రం నెల్లూరు సెంటర్ జైలుకు తరలించారు. కేసు నేపథ్యంలో వెంకటగిరిలో పోలీసులు కోర్టు వద్ద 144 సెక్షన్ విధించారు. ఉదయానికి తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వెంకటగిరి కోర్టు వద్దకు చేరుకున్నారు. కోర్టుకు వచ్చినప్పుడు ముదావంగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలుకు వెళ్లె సమయంలో ఉత్సాహంగా కనిపించారు. నవ్వుతూ, అందరినీ పలకరిస్తూ, కరచాలనం చేస్తూ జైలు లోపలకు వెళ్లారు. వైసిపి నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున వెంకటగిరికి తరలివెళ్లారు. అందరూ ఊహించినట్టే రిమాండ్ విధించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో మార్చి 20 వతేది నుంచి ప్రయత్నాలు చేశారు. మూడు సార్లు హైకోర్టు బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. చివరికి బెయిల్ నిరాకరించింది. అటు తరువాత బెయిల్ ఫిటిషన్‌ను సుప్రీంకోర్టులో వేశారు. విచారణాంతరం బెయిల్ ఇవ్వడం కదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. కాకాణి ఇంటిని వదలి 45 రోజులుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. ఆయనను అరెస్ట్ చేయడానికి నెల్లూరు జిల్లా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రాయచోట పోలీసులు కర్ణాటకలోని చింతామణి, సమీపంలోని ఓ పామ్ హౌస్‌లో చిక్కారు. పోలీసులు కాకాణి అరెస్ట్‌ను గోప్యంగా ఉంచారు. కర్ణాటకలో ఆదివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. రాత్రికి ఆయనను పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు తీసుకొచ్చారు. .భారీ బందోబస్తునడుమ ఆయనను వెంకటగిరి కోర్టుకు తరలించారు. అక్కడ నుంచి జిల్లా జైలుకు వెళ్లారు. కాకాణి అరెస్ట్ జిల్లాలో చర్చినీయాంశమైంది.

రాజకీయ ప్రయోజనాల కోసం

'ఉగ్ర'దాడులకు మతం రంగు పులమొద్దు..

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి -నెల్లూరు

రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రదాడులకు మతం రంగు పలమడం సరి కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సమైక్యత యాత్రలను సోమవారం ఉదయం ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుంచి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. సమైక్యత యాత్రల సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటక ప్రాంతం పైహల్గంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది దేశ పౌరులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఫలితంగా ఆ కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని అన్నారు. దేశం యావత్తు తీవ్ర దిగ్భ్రాంతికి ఈ ఘటన వల్ల గురవడం జరిగిందని అన్నారు. ఉగ్రవాద చర్యల వల్ల దేశంలో ఇటువంటి పరిస్థితులు నెలకొంటున్నా యని అన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు రాజకీయాలకతీతంగా దేశ ప్రజలను ఐక్యం చేసే దిశగా ప్రభుత్వం వ్యవహరించాలని తెలిపారు. ఆపరేషన్ సింధూరం పేరుతో యుద్ధాన్ని మొదలు పెట్టారన్నారు. హఠాత్తుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగి యుద్ధం నిలిపివేయడం జరిగిందని ప్రకటన చేయడం దేశ ప్రజలందరినీ ఆశ్చర్య పరిచిందని అన్నారు. దాడులకు పాల్పడిన తీవ్రవాదులను నేటికీ ప్రభుత్వం పట్టుకోక పోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. యుద్ధం వల్ల సాధించిన ప్రయోజనాలను పార్లమెంటుకు దేశ ప్రజలకు ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడి జరిగి దేశం తీవ్రమైన బాధలో ఉంటే దానికి మతం రంగు పులిమే రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి మంత్రులు ప్రకటనలు చేయడం అత్యంత విచారకరమైన చర్య అని అన్నారు. దేశ ప్రజల మధ్య ఐక్యత సాధించాల్సిన పాలకులు మతం పేరుతో విభజన సృష్టించే ప్రకటనలు చేయడం సరైన చర్య కాదని అన్నారు. ఈ వైఖరికి స్వస్తి పలికి దేశ సమగ్రతను సార్వభౌమత్వాన్ని కాపాడే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన సమైక్యత యాత్రలు, స్టోన్ హౌస్ పేట, పప్పుల వీధి మీదుగా శెట్టిగుంట రోడ్డు వరకు సాగాయి. మధ్యాహ్నం భగత్ సింగ్ కాలనీ నుండి ప్రారం భమైన సమైక్యత యాత్రలు జనార్దన్ రెడ్డి కాలనీ మీదుగా వెంకటేశ్వరపురం సెంటర్ వరకు కొనసాగాయి. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వరరావు, షేక్ మస్తాన్ బి, పి.సూర్యనా రాయణ,కాయంబు శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, కత్తి పద్మ,చిరంజీవి, అల్లంపాటి శ్రీనివాసులు,చెంగయ్య, మూలం ప్రసాద్, షేక్ ఫయాజ్ నాయకులు షేక్ చాన్ బాషా, టి. శివకుమారి ఉన్నారు.

సమైక్యత యాత్రలో సిపిఎం నాయకులు

కందుకూరులో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం డివిజన్ పరిధిలోని ఏడు మండలాలలో 152.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వలేటివారిపాలెం మండలం లో 17.4 మిల్లీమీటర్లు ,కందుకూరు మండలంలో 12.4 మిల్లీమీటర్లు ,లింగసముద్రం మండలంలో 33 మిల్లీమీటర్లు ,గుడ్లూరు మండలంలో 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా వరికుం టపాడు మండలంలో 12.2 మిల్లీమీటర్లు, కొండాపురం మండలంలో 37.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుతుపవనాల ప్రభావం వల్ల ఈ వర్షం కురుస్తుందని చెబుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం పూర్తిగా చల్లబడటంతో పాటు చలిగాదులు వీస్తున్నాయి.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి -నెల్లూరు : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదులకు నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలనికమిషనర్ వై.ఓ నందన్ అన్ని విభాగాల అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లనుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న స్థానిక సమస్యలు పునరావతం కాకుండా శాశ్వత పరి ష్కారాలు అందించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ రాజేశ్వరి ఉన్నారు.

'కాకాణి' అరెస్టు అప్రజాస్వామికం : తూమాటి

ప్రజాశక్తి-కందుకూరు

ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని ఎంఎల్‌సి తూమాటి మాధవరావు తెలిపరు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రిగా పనిచేసిన ఒక వ్యక్తిని అరెస్టు చేసేటప్పుడు కనీస సమాచారం ఇవ్వాలన్న బాధ్యత పోలీసులకు లేకపోవడం బాధ్యత రాహిత్యమేనన్నారు. ముమ్మాటికి కాకాణి అరెస్టు అప్రజాస్వామికమని తెలిపారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం : బుర్రా

మైనింగ్ విషయంలో కాకాని గోవర్ధన్ రెడ్డికి ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఎలాంటి సంబంధం లేదని మాజీ శాసన సభ్యుడు బుర్రా మధుసూదన యాదవ్ తెలిపారు. ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా గోవర్ధన్ రెడ్డిని అరెస్ట్ చేయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అక్రమ అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యంలో తగని పని అన్నారు.

కాకాణి కేరళలో బాడీ మసాజ్‌కు వెళ్లి దొరికాడు..

ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేరళకు బాడీ మసాజ్‌కు వెళ్లి దొరికిపోయారని సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పొదలకూరు ప్రాంతంలో గోవర్ధన్ రెడ్డి ప్రమేయం లేకుండానే అక్రమ మైనింగ్ జరిగిందని వైసీపీ నేతలు చెబుతారా అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అమాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో వేయించారని, ..జర్నలి స్టులను కూడా వదిలిపెట్టలేద న్నారు. ఐదేళ్లు లెక్కకు మించి పాపాలు చేసి, ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నాం న్నారు. కేరళలో సేద తీర్చుకుంటుంటే పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. అక్కడ ఒక బాడీ మసాజ్ సెంటర్ లో దొరికాడని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు 55 రోజులుగా అజ్ఞాత వాసం...ఈ రోజు నుంచి జైలు వాసం గడపబోతున్నారన్నారు. గోవర్ధన్ రెడ్డిపై పోలీసులు అక్రమ కేసు బనాయించారంటూ వైసీపీ నేతలు తెగ బాధపడిపోతున్నారని, కాకాణికి సంబంధం లేకుండా వరదాపురం రుస్తుం నుంచి 60 వేల టన్నుల క్వార్జ్ తరలిపోయిందా అన్నారు. మొగళ్లూరు, దేగపూడిలో అక్రమ మైనింగ్, తోడేరులో డంపింగ్ గోవర్ధన్ రెడ్డికి తెలియకుండానే జరిగాయా అన్నారు. మంత్రిగా వ్యవహరించిన కాకాణి ప్రమేయం లేకుండా ఆయన సొంత మండలం పొదలకూరులో ఇల్లీగల్ మైనింగ్, డంపింగ్ జరిగాయా అన్నారు. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా పక్కా ఆధారాలతో అక్రమ మైనింగ్ గుట్టు రట్టు చేశాం..భారీ యంత్రాలు, పేలుడు పదార్థాలు, డంపర్లను మీడియాకు చూపించామన్నారు. కలెక్టర్, ఎస్‌పి నుంచి సిఎస్, డీజీపీ వరకు, చివరకు ప్రధాన మంత్రికి ఆధారాలతో సహా ఫిర్యాదులు పంపామన్నారు. కోడూరులో రొయ్యల గుంతలు ధ్వంసం చేయించి రూ.1.50 కోట్ల విలువైన రొయ్యలను సముద్రంలోకి వదిలిపెట్టించారన్నారు. కంటేపల్లిలో సెల్ ఫోన్ టవర్లు, చెముడుగుంటలో లారీ కాటా కూల గొట్టించాడు. నల్లబాళెంలో పైపులైన్లు ధ్వంసం చేయించి 15 ఎకరాల సంపంగి తోటలను బీడు పెట్టించారన్నారు. పొదలకూరులో దుకాణాల ముందు పట్టలు వేసుకున్నారని 16 మంది ఆర్యవైశ్యులను 14 రోజులు జైలులో పెట్టించారన్నారు. కాకాణి సాగించిన భూదందాకు అండగా నిలిచిన ముగ్గురు తహశీల్దార్లు, 10 మందికి పైగా రెవెన్యూ సిబ్బంది సస్పెండ్ అయ్యారు..వేలాది ఎకరాల భూముల రికార్డులు మారిపోయాయి తెలిపారు. ఒక్క సర్వేపల్లిలో తప్ప జిల్లాలోని మరే నియోజకవర్గంలో ఈ స్థాయిలో అరాచకాలు జరగలేదన్నారు.

పొదలకూరులో మీడియాతో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మహానాడు ఏర్పాట్ల పరిశీలనలో ఎంపి వేమిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కడపలో నేటి నుంచి ప్రారంభం కానున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, మహానాడు సమన్వయ కమిటీ, ఆర్థిక కమిటీ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కడపలో మహానాడు నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను సోమవారం ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. సభా ప్రాంగణంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఏర్పాట్లపై చర్చించారు. ప్రధాన వేదిక వద్ద చేపట్టిన పనులను పరిశీలించి పలు సూచనలు అందజేశారు. చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నిర్వహించాలని సూచించారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక నాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.కడప మహానాడు ఏర్పాట్లపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, మహానాడు సమన్వయ కమిటీ, ఆర్థిక కమిటీ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతలతో భేటీ అయ్యారు. సోమవారం కడపలోని ఆర్అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ, మంత్రి మండిపల్లి రాంప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఇతర నాయకులు తదితరులతో కలసి మహానాడు ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కల్పించాల్సిన వసతులు, ఏర్పాట్లు, ఇతర అంశాలపై మాట్లాడారు. నెల్లూరు నుంచి వచ్చే వారికోసం తీసుకోవాల్సిన అంశాలపై మాట్లాడారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏర్పాట్ల పరిశీలనలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, బెజవాడ వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా మాట్లాడి ఏర్పాట్లపై వివరాలు ఆరా తీశారు.

కడపలో మహానాడు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

దళిత కుటుంబాలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -నెల్లూరు : ఉడ్ కాంప్లెక్స్‌లో ఇల్లు తొలగించిన దళిత కుటుంబాలకు న్యాయం చేయాలిని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సిపిఎం రూరల్ కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ ఉడ్ కాంప్లెక్స్ పరిధిలో దాదాపు 30 సంవత్సరాల నుండి నివాసం ఉన్నారు. వీరికి ఎటువంటి ప్రత్యామ్నయం చూపించకుండా, రోడ్ల విస్తరణ పేరుతో ఖాళీ చేయించడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. దాదాపు రెండు నెలల నుండి అధికారులకు మొరపెట్టుకున్న ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. 25 కుటుంబాలు నిరుపేద మాదిగ కుటుంబాలకి చెందినవారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కమిషనర్ గారు స్పందిస్తూ వారికి నివాస స్థలాలు ఏర్పాటు చేసే దానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కే పెంచల నరసయ్య, పి. నరసింహారెడ్డి, శివాజీ, వెంకటేశ్వర్లు, ఝాన్సీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కందుకూరులో యోగ సాధన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పురపాలక సంఘంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగ మాసోత్సవ కార్యక్రమం సోమవారం విజయ వంతంగా జరిగింది. ఎన్‌టిఆర్ బొమ్మ వద్ద యోగ ట్రైనర్స్ చే యోగ సాధన చేశారు. మునిసిపల్ కమీషనర్ కె అనూష, సిఐ వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు

ఎంఎల్ఎ 'ఇంటూరి' సహకారంతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - లింగసముద్రం

మండలంలోని తిమ్మారెడ్డి పాలెంలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను సోమవారం ప్రారంభించారు.గ్రామంలో విద్యుత్ స్తంభాలు వేయకుండా నిలిపివేయడంతో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు వల్ల ప్రమాదం పొంచి ఉండడంతో పాటు,కరెంటు సమస్యలు తలెత్తడంతో వెంటనే విద్యుత్ స్తంభాలను మార్చే విధంగా అధికారులు ఆదేశించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో మాజీ మండల తెలుగు యువత అధ్యక్షులు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నీలం బ్రహ్మారెడ్డి, మరికొందరు టిడిపి నాయకులు కలిసి వివరించారు. దీంతో వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ మంత్రి తక్షణమే గ్రామంలో విద్యుత్ స్తంభాలను మార్చాలని ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో అధికారులు గ్రామంలో విద్యుత్ స్తంభాలను మార్చే పనులను ప్రారంభించారు. గ్రామంలో ఎప్పటి నుంచో ఉన్న విద్యుత్ స్తంభాల సమస్య పరిష్కారం కావడంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కి, కందుకూరు శాసన సభ్యులు నాగేశ్వరరావుకి గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు.

మంత్రి పార్ధసారథిని కలిసిన 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు : మంత్రి కె.పార్ధసారధిని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు.కందుకూరు పట్టణంలోని కనిగిరి రోడ్డులో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య నివాసంలో ఆదివారం రాత్రి రాష్ట్ర గహనిర్మాణ శాఖ మంత్రివర్యులు కె పార్ధసారధిని చీరాల శాసనసభ్యులు మద్దులూరి కొండయ్యతో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. కందుకూరు వచ్చిన మంత్రిని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు శాలువాతో ఘనంగా సత్కరించారు..కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు నాదెళ్ల వెంకటరమణయ్య, మాదాల మాల్యాద్రి, ముప్పవరపు వేణు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగించాలని వినతి

ప్రజాశక్తి నెల్లూరు : 25వ డివిజన్ బుజబుజ నెల్లూరు నాగమ్మ కాలనీ. శివాజీ కాలనీ సమతా నగర్ లో వీధిలైట్లు వెలగడం లేదు వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సచి వాలయం అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ బుజబుజ నెల్లూరులో సమతనగర్ నాగమ్మ కాలనీ శివాజీ కాలనీలో అంతా పేదలే నివసిస్తున్నారన్నారు. వారంతా సిటీలో పనులు ముగించుకుని రాత్రి పూట ఇళ్లకు చేరుకునే సమయంలో చీకటిగా ఉండటంతో ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. తక్షణమే స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యల ఎతీసుకోవాలని కోరారు. సిపిఎం శాఖ కార్యదర్శి కే కష్ణమూర్తి. అచ్చి తిరుపాలు వెంకయ్య మనోజ్ రమేష్ ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐఐటి తిరుపతిలో

ప్రకాశం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బి.టెక్ కంప్యూటర్ సైన్స్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) చదువుతున్న విద్యార్థినులు గంగపట్ల మాహితా, చుండూరి సమ్యూక్త చౌదరి ఐఐటి తిరుపతిలోని కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సి.హెచ్. విష్ణు పరిశోధన బందంలో రెండు నెలల కాలానికి పరిశోధనా ఇంటర్న్‌షిప్ సాధించారు. ప్రకాశం కళాశాల విద్యార్థుల పరిశోధనాపరమైన ప్రతిభకు ఇది విలువైన గుర్తింపుగా నిలిచింది. కాలేజ్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఇది ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్ విద్యా స్థాయికి, పరిశోధనపరమైన విజన్‌కు అద్దం పడే గొప్ప ఘనత. విద్యార్థుల పరిశోధనా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి కాలేజీలో ఏఐ ఇన్నొవేషన్ ల్యాబ్ స్థాపించినట్లు తెలిపారు. గూగుల్ క్లౌడ్ కంప్యూటింగ్, జర్మన్ రోబోటిక్ సెంటర్‌లతో యం.ఓ.యు లు కుదుర్చుకుని విద్యార్థుల ప్రయోజనాలపై దష్టి పెట్టాం," అని వివరించారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించిన అకడమిక్ డీన్ డా. ముప్పా లక్ష్మణరావును ఆయన అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ చదలవాడ రవికుమార్ మాట్లా డుతూ, "ఐఐటి తిరుపతి వంటి ప్రతిష్టాత్మక పరిశోధన సంస్థలో మా విద్యార్థులు ఇంటర్న్‌షిప్ సాధించడం, కాలేజ్ విద్యా ప్రమాణాల నాణ్యతను ప్రతిబిం బిస్తున్నదే కాక, ఇతర విద్యార్థులకు కూడా ఆదర్శంగా నిలుస్తుంది అని పేర్కొన్నారు.వైస్ ప్రిన్సిపల్ వరపర్ల హరి బాబు మాట్లాడుతూ, "ఇలాంటి విజయాలు విద్యార్థుల తపన, అధ్యాపకుల నిబద్ధత, మరియు కాలేజ్ దూరదష్టిని ప్రతిఫలిస్తాయన్నారు.ఈ ఇంటర్న్‌షిప్ తమ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగప డుతుందన్నారు. ఆ ఇద్దరు విద్యార్థులుభవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

మాహితా

సమూక్త చౌదరి

నేడు 'యోగాంధ్ర' శిక్షణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించడానికి ఎంపికైన ద్వారా టిటిటిలకు శిక్షణ కార్యక్రమం మండలంలోని అధికారులను మూడు బ్యాచ్‌లుగా విభజించి ట్రైనింగ్ ఇస్తామని ఎంపిడిఒ ప్రసన్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని తెలిపారు. రెండో బ్యాచ్ ఆరోజు ఉదయం 11 గంటలకు వెలుగు కార్యాలయంలో విఒఎలు, సిసిలు, ఎపిఎం, ఎఫ్ఎ, టిఎ, ఎపిఒ తదితర ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనాలని తెలిపారు. మూడో బ్యాచ్ అదే రోజు ఉదయం 11 గంటలకు మండల విద్యా వనరుల కేంద్రంలో జరుగు శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీవర్కర్లు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎం, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొనాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండల తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

బ్రహ్మోత్సవాలకు తాత్కాలిక వేలం

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జూన్ 16వ తేదీ నుండి 25 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఇఒ రామకృష్ణ సోమవారం రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జూన్ 16వ తేదీ నుండి మొదలవుతాయని ఈ బ్రహ్మోత్సవాలకు సంబంధించి తాత్కాలిక భోజన వసతి వేలంపాట నిర్వహించామని, రామలింగేశ్వర స్వామి ఆలయ ఆదాయం గతం కంటే ఈ సంవత్సరం 3 39వేల 500 ఆదాయం వచ్చిందన్నారు. అయితే రంకలరాట్నం వేలంపాట మాత్రం వాయిదా వేయడం జరిగిందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నాయకులు ఆపుల వాసు, ఆలయ ఛైర్మెన్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము హల్‌చల్..

ప్రజాశక్తి-కోవూరు : ఓ ఇంట్లోకి ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటలకు పంచాయతీ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఇంట్లో 5 అడుగుల నాగుపాము దూరింది. 2 గంటలసేపు ఇంట్లోవారు భయభ్రాంతులకు గురయ్యారు. నైట్ గస్ట్‌లో ఉన్న పోలీస్ సిబ్బంది పిలువగా హోంగార్డ్ మోహన్ వచ్చి దానిని చంపడంతో ఇంట్లో ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసు సిబ్బంది వారికి ధన్యవాదాలు తెలిపారు.



వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు శాఖా గ్రంథాలయంలో సోమవారం సమ్మర్ క్యాంపులో భాగంగా పిల్లలకు నీతికథలు చెప్పి వాటి ప్రాముఖ్యం వివరించారు. ఈ కార్యక్రమంలో జయరామయ్య రిటైర్డ్, విద్యాసంస్థలు ముఖ్య ప్రభుత్వ టీచర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లైబ్రేరియన్ సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో మంగళవారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ సోమవారం తెలిపారు. వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ఉత్తరపదరం, మెయింటెనెన్స్ కారణంగా పట్టణంలోని 4, 5, 6, 7, 8, 9, 10, 11, 13, 15, 16, 17, 18 వార్డుల్లో నీటి సరఫరా ఉండదని, బుధవారం యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఆయా వార్డుల ప్రజలు సహకరించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి సానుభూతి

ప్రజాశక్తి-సీతారామపురం : మండల పరిధిలోని రొంపిదొడ్ల గ్రామంలో విఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న జంగం సుబ్బయ్య గత కొన్ని రోజులు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు ఆయన మృతిపై తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తక్షణ సహాయం కింద రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలం సోమశిల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సోమవారం విద్యుత్ శాఖ ఏఇ ఎం.సురేష్ బాబు తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరా లైన్ మరమ్మతులు కారణంగా ఉదయం 9గంటలు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉదయం 6 నుంచి 9వరకు ఉంటుందని ఆయన తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రజలు విద్యుత్ సరఫరా నిలిపివేత కు సహకరించాలని కోరారు.

రేషన్‌షాపుల వద్దే సరుకులు

ప్రజాశక్తి-బిట్రగుంట : జూన్ ఒకటో తేదీ నుండి రేషన్ షాపుల వద్ద మాత్రమే రేషన్ సరుకులు పంపిణీ జరుగుతుందని బోగోలు తహశీల్దార్ సురేష్ బాబు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో తహశీల్దార్ సురేష్ బాబు మాట్లాడుతూ ఇంటింటికి రేషన్ పంపిణీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం వల్ల జూన్ ఒకటో తేదీ నుండి రేషన్ షాపుల వద్ద సరుకుల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రేషన్ షాపుల వద్ద పంపిణీ కోసం రెవెన్యూ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

పలు సమస్యలపై అర్జీలు

ప్రజాశక్తి-దగదర్తి : గ్రీవెన్స్ డే రోజు మండల నుంచి పలు సమస్యలపై అర్జీలు వచ్చాయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల మొత్తం మీద పది అర్జీలు వచ్చాయని వారు తెలిపారు. వీటిలో ఆధంగల్ చేర్పులు మార్పులు కోసం సర్వే కోసం దామవరంలో ఏర్పడుతున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంలో భూములు కోల్పోయామని అయితే నష్టపరిహారం ఇంకా అందలేదని అర్జీలు సమర్పించారని వారు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి దుత్తలూరు : దుత్తలూరు మండలం వెంకంపేట గ్రామంలో శ్రీ వినాయక స్వామి శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విమాన శిఖరం ధ్వజస్తంభం సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన కార్యక్రమం 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సీతారామ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందన్నారు. 28వ తేదీ బుధవారం శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష పీఠాధిపతితో అభిషేక కార్యక్రమంలో జరుగును. 29వ తేదీ గణపతి పూజ పుణ్యహ వచనం పంచ గవ్య రాసిన రక్షాబంధనం దీక్ష విధి యంత్ర సంస్కారంలో యజ్ఞాల ప్రవేశము సాయంకాలం గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు జరుగునని, పెద్దల సమక్షంలో దైవాజ్ఞలు సుముహూర్తము నిర్ణయించారు. ప్రతి ఒక్కరూ ప్రతిష్ట కాళిషేకములు జరుగును స్వామివారి తీర్థ ప్రసాదములు సేకరించవలసిందిగా కోరారు. నిత్య అన్నదానం సంస్థచే కార్యక్రమాలు

అంకమ్మ తల్లి కొలుపు

ప్రజాశక్తి-దుత్తలూరు : దుత్తలూరు మండలం ముత్తరాసుపల్లి ఎస్‌సి కాలనీలో గత రెండు రోజులుగా జగత్ జనని భూలోక మాత అంకమ్మ తల్లి కొలుపులు జాతర అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం సోమవారం జరుగుతున్న చెన్నకేశవ స్వామి ఊరేగింపునకు వందలాది భక్తజనుల నడుమ డప్పుల చప్పుళ్లతో భాజాసంద మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలతో స్వామి వారి ఊరేగింపు కొలహలంగా సాగింది. డప్పుల వాయిద్యాల నడుమ గ్రామ ప్రజల నృత్యాలు కనువిందు చేశాయి. గ్రామంలో స్వామి వీధి వీధి ఊరేగించడంతో అనంతరం అన్నదానం నిర్వహించారు.



సిపిఎం ఆధ్వర్యంలో సమైక్యతా యాత్రలు

మాట్లాడుతున్న జొన్నలగడ్డ వెంకమరాజు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మత సామరస్యం, దేశ సమగ్రత, పరిరక్షణ కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న సమైక్యతా యాత్రలో భాగంగా పట్టణంలో సోమవారం ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ లోని పెహల్గాంలో 26 మంది పర్యాటకులను హతమార్చిన ఉగ్రవాదులను ఖండిస్తూ సమైక్యత యాత్రను ప్రారంభించామన్నారు. ఉగ్రవాద దాడిలో మరణించిన వారిలో విశాఖకు చెందిన చంద్రమోహన్, నెల్లూరుకు చెందిన మధుసూదన్ మరణించడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. మతసామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజలకు పిలుపునిచ్చారు. ఒకవైపు ఉగ్రవాదం దేశ సమగ్రత, సమైక్యతకు సవాల్ చేస్తున్న స్థితిలో మరోవైపు కేంద్ర ప్రభుత్వం మతాన్ని, ఉగ్రవాదాన్ని కలిపి రెండింటికి తేడా లేకుండా మైనారిటీకి సంబంధించిన మతాలను ఉగ్రవాదులుగా ముద్రించడా న్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సిపిఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, సిపిఎం నాయకులు షేక్ జానీ బాషా, షేక్ మునీర్ బాషా, డివైఎఫ్ఐ నాయకులు దత్త శ్రీ కోటయ్య, శ్రీనివాసులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం రెండవ రోజు సమైక్యతా యాత్ర పట్టణంలోని శాంతినగర్‌లో నిర్వహించారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోరుతూ ఈ సమైక్య యాత్రలు జరుగుతున్నాయని పహల్గామ్‌లో 26మంది పర్యాటకులను ప్రాణాలు తీసిన ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం పట్టుకొని శిక్షించాలన్నారు.

కావలిలో..

భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్న తీరును కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఖండించకపోవడం విచారకరమైన విషయమన్నారు. కొన్ని మతశక్తులు హిందూ, ముస్లిముల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నాయని, ఇలాంటి ద్వేషాలను ప్రజలు అప్రమత్తంగా ఉండి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పసుపులేటి తిరుపాలు, నాయకులు వై.కృష్ణమోహన్, వి.సత్యనారాయణ కార్యకర్తలు బాబురావు, చెంచురామయ్య, సీనయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సమైక్యతా ర్యాలీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలో బుధవారం జరిగే సమైక్యత యాత్ర ర్యాలీలో మండల ప్రజలు విరివిగా పాల్గొనాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి మొగిల్ నిస్సార్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన 26మంది పర్యాటకులను టెర్రరిస్టులు బలిగొన్నారన్నారు. ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజన తీసుకురావాలని మత విద్వేషాలు రెచ్చగొట్టాలని ఉద్దేశ పూర్వకంగా దాడి చేయడం జరిగిందని, దానికి వ్యతిరేకంగా దేశ ప్రజలు సమైక్యంగా నిలబడ్డారని, ఐక్యంగా ఉగ్రవాదాన్ని ప్రతిఘటించారని, మత సామరస్యాన్ని ప్రజల ఐక్యతను పెంపొందించడానికి గాను 28వ తేదీన ఎఎస్‌పేట మండల హెడ్ క్వార్టర్‌లో జరిగే సమైక్యతా ర్యాలీలో కుల మత జాతి భేదం లేకుండా సమాజంలోని అన్ని తరగతుల వారు పాల్గొనాలని, మండల ప్రజలకు పిలుపునిచ్చారు.

కొండయ్య కుటుంబానికి పరామర్శిస్తున్న ఎంపి బీద మస్తాన్‌రావు

కొండయ్య కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి బిట్రగుంట

బోగోలు మండలంలో ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ నాయకుల కుటుంబ సభ్యులను సోమవారం బిఎంఆర్, వాసెంటు ట్రస్ట్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు పరామర్శించారు. ఎబికండ్రిక గ్రామంలో మరణించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గెద్ద కొండయ్య వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ టిడిపి పార్టీ నాయకులకు ఏ సమస్య వచ్చినా పార్టీ అండదండలు ఎప్పుడు వారికి వారి కుటుంబ సభ్యులకు ఎప్పుడు ఉంటాయని, గెద్ద కొండయ్య వేణు మరణం వారి కుటుంబ సభ్యులకు పార్టీకి తీరని లోటని, ఈ సందర్భంగా వారి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం ప్రయత్నాలు చేస్తున్నామని, త్వరలోనే ఏదో ఒక రైల్వే యూనిట్‌ను బిట్రగుంటకు తీసుకొని వస్తామని, బిట్రగుంటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు ఉపాధ్యక్షులు బీద గిరి, టిడిపి అధ్యక్షులు మాలపాటి నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు పిన్నిబోయిన సుధాకర్ యాదవ్, సీనియర్ నాయకులు కాంట్రా రఘురామ నాయుడు, కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి, ఎర్రం వెంకటేశ్వర్ రెడ్డి, ఎర్.సుధీర్ బాబు, దొడ్ల అంజయ్య యాదవ్, బోగిరి ప్రభాకర్, మన్సూర్ భాషా, పుట్ట సుబ్బారావు, సమీవుల్లా, తిరుపతి, బిజెపి మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, స్థానిక టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎను ఆహ్వానిస్తున్న నాయకులు

31న 'చలో' టౌన్ హాల్'

ప్రజాశక్తి-కావలి

నూరుభాషా ప్రతిభా ప్రోత్సాహక బహుమతుల కార్యక్రమం 'చలో టౌన్ హాల్' 31న నెల్లూరులో జరుగుతుందని నూర్‌బాషా సంక్షేమ సంఘం బాధ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని సోమవారం కలిసి, నెల్లూరు టౌన్ హాల్‌లో జరిగే సభకు రమ్మని ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కావలి డివిజన్‌లోని నూరుభాషా సోదర, సోదరీ మణులు అత్యధిక పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు హాజరవుతారని తెలియజేశారు. కార్యక్రమంలో నూరుభాషా సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్, గౌరవ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి మీరా సాహెబ్, కావలి మండల అధ్యక్షులు షేక్ ఖలీల్, మీడియా ప్రతినిధి షానవాజ్, షేక్ గౌస్ (రిటైర్డ్ టీచర్) షేక్ మస్తాన్, టిడిపి నాయకులు షేక్ హజరత్, ఎంప్లాయ్ అధ్యక్షులు షేక్ ఖాజావలీ, యూత్ నాయకులు షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

అమరా వేదగిరికి సముచిత స్థానం

ప్రజాశక్తి-కావలి

అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తాకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని కావలి ఎం.ఎల్.ఎ. కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ 33వ వార్డు నాయకులు, తెలుగుదేశం కార్యకర్తల కష్ట ఫలితంతో 553 ఓట్ల మెజారిటీ ఈ వార్డులో రావడం జరిగిందన్నారు. తనమీద నమ్మకంతో, ఈ కావలికి సేవ చేస్తానన్న నమ్మకంతో మెజారిటీ ఇచ్చినందుకు ఈ వార్డు సంబంధించిన ప్రతి ఒక్క వ్యక్తికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. కావలి తెలుగుదేశానికి కురు వృద్ధులు సుబ్రహ్మణ్యం అని, ఆయన సతీమణి కౌన్సిలర్‌గా, ఆయన కౌన్సిలర్‌గా తెలుగుదేశం ఆవిర్భావం నుంచి తెలుగుదేశం కుటుంబసభ్యుడిగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఆయన ఇంటి ముందుకు వచ్చి, సిమెంట్ రోడ్డు శంకుస్థాపన చేశారంటే ఆయన నిబద్ధత, ఆయన క్రమశిక్షణ అంత గొప్పదన్నారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకొని రాజకీయంలో తాను కూడా అడుగుపెట్టానన్నారు. వేదగిరి చాలాకాలం నుంచి తనకు ఒక మంచి మిత్రుడు అని, ఎక్కడ కనిపించినా ఆత్మీయంగా, మనసారా పలకరించే వ్యక్తి అని అన్నారు. కావలి కనకపట్నం దిశగా అడుగులు వేస్తుందని, కావలికి అనుసంధానం చేసుకుని కొన్ని వందల కంపెనీలు కావలికి వస్తున్నాయని, దానికి ముఖ్య కారణం జవహర్ భారతి కళాశాలను ఏర్పరిచి, కొన్ని లక్షల మందికి జీవితాన్ని ఇచ్చిన దొడ్ల రామచంద్రా రెడ్డి ఒకరని, వ్యాపారాలు ప్రారంభించిన అనేకమందికి ఉపాధి కల్పిస్తున్న ఆర్యవైశ్యులు ఇంకొకరిని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దయవల్ల కావలికి ఎయిర్‌పోర్ట్ వస్తుందని, దగ్గరలో రామాయపట్నం పోర్ట్ వచ్చిందని, ఈ రోజుల బిపిసిఎల్ కంపెనీ వస్తున్నాయి, రామాయపట్నం పక్కన ఇండో సోలార్ కంపెనీ రూ.24వేల కోట్లతో రాబోతుందన్నారు. 8.5 కిలో మీటర్ల పొడవున్న ఈ కావలి ట్రంక్ రోడ్డు

ఎంఎల్ఎను సన్మానిస్తున్న నాయకులు

వ్యాపారంగా విస్తరిస్తే మొట్టమొదట లబ్ధి చేకూరేది కావలి వైశ్య వ్యాపారస్తులకే అని అన్నారు. యువతకు భారీగా ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆరు సంవత్సరాలుగా మున్సిపాలిటీ ఎన్నికలు జరగక కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయన్నారు. త్వరలోనే కావలి మున్సిపాలిటీ ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. కావలిని అభివృద్ధి చేయాలని తపన ఉన్న వారినందరిని కూడా ఆహ్వానించి తెలుగుదేశంపార్టీలోకి చేర్చుకోవాలని, వారి సలహాలు కూడా ఈ కావలి అభివృద్ధి కోసం తీసుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. గతంలో యాదగిరి ఈ కావలిలో కౌన్సిలర్ గా పనిచేసిన అపారమైన అనుభవం ఉందని, అధికారులతో మాట్లాడే చనువు ఉందని, పేదవాళ్లకు పని చేయాలనే తపన ఉందని, అందుకే మాతో నడవాలనితే తాము చేపట్టబోయే ప్రతి పనికి ఆయన శక్తి కూడా తయారైతే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. నావ్యాపారాలను వదిలి, తాను ఒక సేవకుడిగా సేవ చేయాలని వచ్చానన్నారు. జూన్ 3వ తేదీన కావలిలో సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తానని తెలిపారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని తెలుపబోతున్నానన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ అందజేసిన దృశ్యం

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో సోమవారం కావలి పట్టణంలోని శంకరమఠంలో 12 మంది విద్యార్థులకు ఉచితంగా బ్రాహ్మణ మహాసంఘం కావలి శాఖ తరఫున నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి.వి.ఎస్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసులు శంకర మఠం వైస్ ప్రెసిడెంట్ టిఎవిఎన్ ప్రకాష్ రావు, బ్రాహ్మణ సంఘం లేడీ సెక్రెటరీ బిట్రగుంట మీనా బాల పుస్తకాలు పంపిణీ చేశారు. అడిగిన వెంటనే కార్యక్రమం చేసుకునేందుకు అనుమతి ఇచ్చిన కనపరాజు శ్రీనివాసరావు అధ్యక్షుల వారికి సంస్థ తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు టి.రామచంద్రయ్య పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

జొన్నవాడ గ్రామంలో పినాకిని నదీ తీరాన వెలసి ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కన్నుల పండువగా సాగిన కళ్యాణోత్సవానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. శివనామ స్మరణతో జొన్నవాడ ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. స్వామి అమ్మవార్ల కల్యాణం సందర్భంగా కోవూరు ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్వామి అమ్మ వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టువస్త్రాలు తలపై పెట్టుకుని స్వామి సన్నిధికి చేరుకున్న ఎంఎల్ఏ ప్రశాంతి రెడ్డి ఆలయ ఉత్సవ కమిటీతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితులు ఆశీర్వదించి ఆమెకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో

పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డి

జొన్నవాడ ఆలయ సేవా కమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, ఆలయ ఇఒ అర్వభూమి శ్రీనివాసులు రెడ్డి, గ్రామ సర్పంచ్ కందికట్లు పెంచలయ్య, జెడ్‌పిటిసి సూరా ప్రదీప, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మోర్ల సుప్రజ, టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్, ఈకెవైసి తప్పనిసరి అని ఎంపిడిఒ ఖాజావలీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ కోసం ఈకెవైసి త్వరితగతిన కుటుంబ సభ్యులతో పూర్తి చేయించుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామ ప్రజలు తమ పరిధిలోని సచివాలయాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ సర్వే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఈ మ్యాపింగ్ తప్పనిసరి అన్నారు.

ఇంటి స్థలం డాక్యుమెంటు పోయినది

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, లింగసముద్రం మండలం మరియు గ్రామం నివాసి **కొవిరి సునీత**, భర్త **సంజీవరెడ్డి** కి చెందిన ఇంటి స్థలం డాక్యుమెంటు పోయినది. కృష్ణా జిల్లా, కంచికచర్ల సర్వే నెంబర్ **668/2** లోని **209**స్ నెంబర్ ప్లాట్ కు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంటు లింగసముద్రం గ్రామంలో జెరాక్స్ కోసం వెళ్ళుతూ పోయినది. దొరికినవారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
కొవిరి సునీత, భర్త సంజీవరెడ్డి,
H.No: 3-13, లింగసముద్రం గ్రామం మరియు మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా,
సెల్: **81790 51718**

మహానాడు వేదిక పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

కడప జిల్లాలో 27, 28 తేదీలో జరుగు మహానాడు ప్రాంగణం వేదికను రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సోమవారం కడప జిల్లాలో అంగరంగ వైభవంగా జరుగబోవు మహానాడు వేదిక పరిశీలనను కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి తో కలిసి ఏర్పాట్లను పరిశీలించినట్లు రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ, నెల్లూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంకు టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-సీతారామపురం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో బాధితుల నుంచి తహశీల్దార్ పీవీ కృష్ణారెడ్డి అర్జీలు స్వీకరించారు. గుండుపల్లి రేషన్ షాప్ డీలర్ రాజీనామా విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖాళీని భర్తీ చేస్తామన్నారు. ఆదివిరాళం చిన్నాగంపల్లి గ్రామానికి చెందిన మాదిరి లక్ష్మయ్య తన పూర్వీకుల నుంచి సాగు చేసుకున్న భూములు ఆన్లైన్‌లో నమోదు కాలేదని అర్జీ రూపంలో తహశీల్దార్‌కు సమర్పించారు. పై సమస్యలను పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మం డలం విశ్వనాథ రావుపేట పంచా యతీలో ఉన్న రైల్వే మిక్సెడ్ హై స్కూల్ లో 1999 - 2000 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఫంక్షన్ ను నెల్లూరు హోటల్ రెజెంట్‌లో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాబు రెడ్డి మాస్టర్, శ్రీ దేవదాస్ మాస్టర్, ప్రసాద్ మాస్టర్, రూప్ని టీచర్, మల్లేశ్వరి బాయ్ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు విద్య నేర్పించిన గురువులను గుర్తు పెట్టుకొని ఉపాధ్యాయులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అందరూ తమ తమ కుటుంబాలతో కలిసి పాల్గొని వారి చిన్ననాటి అనుభూతులను గుర్తు చేసుకున్నారు.

In The Court of the III Addl. District Judge : Nellore
E.P. No. 523 / 2023
Arbitration Case No.834/2021

M/S Shriram City Union Finance Ltd, Branch Office at Nellore-1, Rep by its G.P.A. Holder A.Ramana Reddy - Award- Holder

Vs

1. Karakambaka Murali
2. K. Kameswaramma
3. B. Varalaxmi
4. K. Srinivasulu
5. M. Raju - J.Drs

వేలం ప్రకటన

పై నెంబరు అవార్డు హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొరకు 1 మరియు 4 జె.డి.ఆర్స్ తాలుకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **16-06-2025వ** న **ఉదయం 10.30 గంటల** నుండి **సాయంత్రం 5 గంటల** లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాట దారులు ఎవరైనా వేలంపాటలో పాల్గొని పాటపాడుకొనవచ్చును.

SCHEDULE

SPSR Nellore District, SPSR Nellore Registration District, Buchireddypalem Sub-Registration District, Buchireddypalem Revenue Mandal, Iskapalem Grama Panchayat, Iskapalem Village Accounts, bearing Sy No.301/A, 304/2, 304/3, 308 land laid out into house plots, Southern Side of Plot No.6 admeasuring 30 ankanams or 240 sq.yards or 200.7 sq.mts of vacant site along with RCC building **bounded by: East** : Plot No.11, **West**: Road, **North** : Vacant land of K.Kamakshmma, **South**: Vacant land of K.Kamakshmma and others. Within this an extent of 30 ankanams 240 sq.yards or 200.7 sq.mts of vacant land with all Others easementary rights.

DHR Value of Rs.15,00,000/-
Amin Value of Rs.15,00,000/-
Market Value of Rs.4,80,000/-

Sk.Abdul Samath, B.Com., B.L.,
అవార్డు హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the Principal Junior Civil Judge : Nellore
O.S.No. 1410 / 2021

State Bank of India, RASMEC, Vedayapalem, Nellore, Rep.by its Chief Manager - Plaintiff

Thummatati Subba Rao - Defendant

Notice

To,
Thummatati Subba Rao,
S/o Thummatati Narasaiah,
residing at D.No. 25/1/1183, Gowthami Nagar 2nd Street, Pindimill Centre, Podalakur Road, Nellore.

పై నెంబరు వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **27-06-2025వ** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జి.వి.ఎల్.నాగమణి, బి.ఏ., బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.